క్లుప్తంగా

పొన్నూరు ఆర్టీసీ డీఎంగా అజిత కుమారి



పొన్నూరు (చేబ్రోలు): పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టి.అజిత కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల డిపోకు చెందిన టి.అజితకుమారి పొన్నూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్ బాపట్ల డిపోకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అజిత కుమారికి ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఘనంగా పాటెమ్మతల్లి గ్రామోత్సవం



గొడవర్రు (చేబ్రోలు): చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామంలోని గ్రామదేవత పాటెమ్మ తల్లి అమ్మవారి గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. పురాతనమైన పాటెమ్మతల్లి అమ్మవారి దేవాలయం జీర్ణోద్ధరణకు చేరింది. భక్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. గురువారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు



ప్రత్తిపాడు: గ్రంథాలయంలో నేటినుంచి విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు ప్రత్తిపాడు లైబ్రేరియన్ బి.అరుణ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక పఠనం, పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు, వేసవి శిబిరంలో నేర్చుకున్న పలు అంశాలపై రోజుకో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 11వ తేదీన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందిస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా చూడాలని ఆమె కోరారు.

మైనర్లు నడిపితే వాహనాలు సీజ్

ప్రత్తిపాడు: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ (ఎంవీఐ) జె.అనిల్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం రాత్రి ఎంవీఐ అనిల్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న ఒక ట్రాక్టర్‌తో పాటు గూడ్స్ వెహికల్‌ను, అదేవిధంగా ఎలాంటి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మైనర్లు నడుపుతున్న ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. పద్దెనిమిదేళ్ల లోపు బాలలు వాహనాలు నడుపుతున్నందుకు గాను రూ. 5 వేలు, లైసెన్సు లేకపోవడం వలన అదనంగా మరో రూ. 5 వేలు చొప్పున ఒక్కో వాహనానికి రూ. 10 వేలు అపరాధ రుసుములుగా విధించి, సీజ్ చేసినట్లు ఎంవీఐ బుధవారం చెప్పారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సూచించారు. మైనర్లు వాహనాలను నడిపితే భారీగా ఫైన్ విధించడంతో పాటు వాహనం సీజ్ చేస్తామని తేల్చిచెప్పారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషనులో అప్పగించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులు భర్తీకి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. శారదా కాలనీలో (అంగన్‌వాడీ కార్యకర్త), అంకిరెడ్డిపాలెం, శ్రీకృష్ణదేవరాయ నగర్, సమ్మర్ పేట, గణేష్ నగర్ 1, ఆర్టీసీ కాలనీ, వెంగళరావు నగర్ 1 ప్రాంతాలలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయని చెప్పారు. అర్హులైన వారు జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

నెహ్రూనగర్: బాల్య వివాహాల నిర్మూలనలో తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలల పరిరక్షణ విభాగ కౌన్సిలర్ రోజ్‌లీనా తెలియజేశారు. బుధవారం నెహ్రూనగర్ ఒకటో లైన్లో ఉన్న అంగనవాడీ కేంద్రంలో తల్లిదండ్రులు, విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలన, బాలల చేత భిక్షాటన, పోక్సో చట్టం, దత్తత తదితర అంశాలపై సెక్టర్ సూపర్‌వైజర్ నీలిమ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను చదువు వైపు దృష్టి సారించేలా తల్లిదండ్రులు తగిన పాత్ర పోషించాలన్నారు. సామాజిక కార్యకర్త షేక్ అబ్దుల్ రషీద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితమంతా అబద్ధాలమయమే

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు నిన్ను నమ్మం బాబూ అంటున్నారు
- గుంటూరులో వైఎస్సార్ సీపీ నేతల నిరసన కార్యక్రమం
- టీడీపీ మేనిఫెస్టో అంతా మోసపూరితం



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను చూపిస్తూ మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మరోసారి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రతి ఒక్కరిని మోసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు. మహానాడులో టీడీపీ మేనిఫెస్టో విడుదల చేసిన నేపథ్యంలో ప్రజలను వంచించే విధంగా ఉండటంపై 'నిన్ను నమ్మం బాబు' అనే నినాదంతో బుధవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లో ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోను వ్యతిరేకిస్తూ చేతుల్లో క్యాలీఫవర్ పట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మేనిఫెస్టోను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక పవిత్ర గ్రంథంలా భావించారని.. భగవద్గీత, ఖురాన్, బైబిల్ లా భావించి ఇచ్చిన ప్రతిమాటను నెరవేర్చారన్నారు. చంద్రబాబుకు అసలు మేనిఫెస్టో గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం చేసుకోవాలని సూచించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడమే చంద్రబాబుకు ఉన్న పెద్ద ఉద్యోగమని విమర్శించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ 14 ఏళ్లపాటు సీఎంగా ఉన్నానని చెప్పుకునే చంద్రబాబు ప్రజల కోసం ఏం చేశారని ప్రశ్నించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ చంద్రబాబు స్వలాభం కోసం తప్ప, ప్రజలకు మేలు చేసే బుద్ధి లేదన్నారు. డెప్యూటీ మేయర్లు షేక్ షజిల, వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరిఫాతిమా, పార్టీ నేతలు గులాం రసూల్, నర్గీస్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో పనిచేసేవారిని ప్రజలు మరిచిపోరు



బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సత్కరిస్తున్న వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించడం ద్వారా ప్రజల మన్ననలు పొందవచ్చని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్ అన్నారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులను నిర్వర్తిస్తూ ఇటీవల వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీహెచ్ఎస్ సీతమ్మ, ఏఎన్ఎంలు టి.పద్మావతి, కె.లలిత, ఎంఎల్‌హెచ్‌పి ఆర్ఎన్ అనుదీప్, ఎంపీహెచ్ఏ ఎ.రఘుబాబు, ఎ.ఏడుకొండలు, 104 సిబ్బంది అరుణలకు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. దుశ్శాలువాలు, పూలమాలలతో ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెజియా గ్రేస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తోటి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ మండలంలో ఉద్యోగ సమయంలో తనకు సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. అదే సహకారాన్ని ప్రస్తుత వైద్యాధికారులకు కూడా అందించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మరియరాణి, ఎంపీటీసీ సువార్తమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంటిసాకులొద్దు.. ప్రగతి చూపండి

ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై డీపీఓ కేశవరెడ్డి ఫైర్



ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై మండిపడుతున్న డీపీఓ కేశవరెడ్డి, వేదికపై ఎంపీడీఓ శ్రీరమ్య

ప్రత్తిపాడు: 'ఊరుకుంటుంటే ఏవేవో కథలు చెబుతున్నారు. ఎక్కడా లేని కుంటిసాకులు చెబుతున్నారు. మా వల్ల కాదంటారు. వినడం లేదంటారు. ఏం తమాషాలుగా ఉందా. వాట్ ఆర్‌యూ టాకింగ్..' అంటూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఫైర్ అయ్యారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహనిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా పురోగతిని సమీక్షించారు. మండలంలో ఇప్పటి వరకు కేవలం 56 శాతం టార్గెట్ మాత్రమే చెయ్యగలిగామని, మండలంలో అత్యధికంగా ఇళ్ల ప్రత్తిపాడు లేఅవుట్‌లోనే ఉన్నాయని, ఇక్కడే ప్రగతి కనిపించకపోతే ఎలాగని డీపీఓ ప్రశ్నించారు. స్పందించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రామచంద్ర, నిఖిల్‌లు మేము కూడా ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి, విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒకటికి పదిసార్లు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అయినా వారు వినడం లేదని, మా వల్ల అయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అలా అయితే మీతో పాటు మేము కూడా పనిష్ అవుతామంటూ డీపీఓ మండిపడ్డారు. ఎంపీడీఓ శ్రీరమ్య సైతం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అస్సలు పనే చెయ్యడం లేదంటూ కలెక్టర్ వీసీ, టీసీల్లో తిడుతున్నారని, మిమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించమని చెబుతున్నారని, పనిచెయ్యకుంటే మీరెందుకని విరుచుకుపడ్డారు. ఏదిఏమైనా మరోసారి లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూచించారు. వెంటనే హౌసింగ్, వైకేపీ వీఓఏలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీఎం సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం

- మూడు రోజుల పాటు అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల
- విశాఖ శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతి రాక
- మహా కుంభాభిషేకం నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

పెదకాకాని: పెదకాకాని శివాలయంలో మహా కుంభాభిషేకం జరిపించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకూ మూడు రోజుల పాటు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్ల అనుగ్రహంతో త్రయాహ్నికముగా మహా కుంభాభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రహ్మశ్రీ ఆగమిక నవులూరి సాయిబాబు దీక్షితులు వారి ఆచార్యత్వములో రాజ, రాష్ట్ర క్షేమం, అభివృద్ధి కాంక్షిస్తూ శివానుగ్రహమున శైవాగమ శాస్త్రోక్త సాంప్రదాయము పద్ధతిలో జరుగుతుందన్నారు. మహా కుంభాభిషేక మహోత్సవం పురస్కరించుకుని రాహుకేతువు పూజలతో సహా విగ్రహారాధనతో కూడిన అన్ని అర్జీత సేవలు నిలుపుదల చేయడం జరిగిందని ఏసీ వివరించారు. ఆలయానికి బుధవారం రాత్రి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి చేరుకున్నారన్నారు. తొలిరోజు గురువారం ఉదయం 6 గంటలకు మంగళవాద్యములు, వేదపారాయణ, గోపూజ, గురుపూజ, అంతరాలయ మూలగణపతికి విశేష స్నపన అర్చనలతో మొదలై యాగశాల ప్రవేశం, అఖండదీక్షాపరాధన, అస్త్రరాజార్చనం, నీరాజనం తదితర క్రతువుతో మంత్రపుష్పం, చతుర్వేదస్వస్తి, తీర్థ ప్రసాద వినియోగాలు జరుగుతాయన్నారు.

ఏఎన్‌యూని సందర్శించిన ఆర్.నారాయణమూర్తి



సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తిని సత్కరిస్తున్న ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: సినీ రచయిత, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. యూనివర్సిటీలో జరుగుతున్న విద్య, పరిశోధన, బోధన అంశాలను వీసీ ఆయనకు వివరించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య సిద్దయ్య, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, సోషియాలజీ విభాగాధిపతి ఆచార్య వెంకటేశ్వర్లు, సీఈ నరసారెడ్డి, ఏసీఈ ప్రకాశరావు, యూనివర్సిటీ ఇంజినీర్ కుమార్ రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



పాత గుంటూరు: స్తంభాలగరువు కోదండ రామస్వామి దేవస్థానంలో ఏకాదశి పురస్కరించుకొని బుధవారం కళారత్న డాక్టర్ మహంకాళి సూర్యనారాయణ శర్మ శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జి.వైష్ణవి, రేష్మిత, లిఖిత, వర్షిణి, హర్షిని, పద్మ, యశస్వి శ్రీయ, ఆర్.వైష్ణవి, పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమాన్ని మహంకాళి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే టీడీపీ దుష్ప్రచారం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఎంపీపీ తుళ్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగంజాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి వెళుతున్న పైపులైన్ నుంచి శుద్ధ జలాన్ని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు సరఫరా చేసేందుకు తీర్మానం జరిగిందన్నారు.

స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి రెండు గ్రామాల ప్రజలకు త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.2.35 కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేయడం జరిగిందన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్లకు గుంటూరుకు అతి సమీపంలో ఉన్న గ్రామాలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే తాగునీరు ఇవ్వాలనే ఆలోచన ఏనాడు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళి, కార్పొరేషన్ మేయర్, ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తుంటే బుదరజల్లే పనులు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, నాయకులు అమ్మిశెట్టి శివశంకరరావు, కానుగోలు శంకరరావు, తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ విగ్రహం ఆవిష్కరణ



పట్నంబజారు: సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం గుంటూరు నగరంలోని గణేష్‌నగర్‌లో బుధవారం జరిగింది. కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో కృష్ణ జయంతి సందర్భంగా జరిగిన కేక్ కటింగ్, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరిఫాతిమా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ఆమెను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ పఠాన్ రిహానా, పార్టీ సీనియర్ అధ్యక్షుడు నూర్‌ఖాన్, విగ్రహదాత వల్లెపు కుమార్, కృష్ణఫ్యాన్స్ అసోసియేషన్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



చెక్కు అందిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తించే చెన్నకేశవులు, సీఆర్ఎస్ఏ ప్రసాద్‌లు ఈ ఏడాది జనవరిలో వేర్వేరు తేదీల్లో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో అదనపు కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కులను చెన్నకేశవులు భార్య లక్ష్మికి, ప్రసాద్ భార్య విజయలక్ష్మికి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలుపై చర్చకు సిద్ధమా?



మాట్లాడుతున్న నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

నగరంపాలెం: టీడీపీ నేత చంద్రబాబు (2014–19) ఐదేళ్లల్లో ఎన్ని హామీలను అమలు చేశారో.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు ఎన్ని హామీలను అమలు చేస్తున్నారో చర్చించేందుకు సిద్ధమా.. అని టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణకు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు సవాల్ విసిరారు. వయసు రీత్యా పెద్దోడివని, నువ్వే చెబితే చర్చకు వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఒకవేళ సవాల్‌కు రాకపోయిన కనీసం బహిరంగ లేఖ రాస్తావా అని మేయర్ ప్రశ్నించారు. గుంటూరు సంపత్‌నగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం మేయర్ కావటి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తిగా అవాకులు, చెవాకులు పేలవద్దని కన్నాకు హితవు పలికారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం తథ్యమని అన్నారు. ఇటీవల జరిగిన మహానాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అవాకులు చెవాకులు పేలారని ఇది సరికాదని అన్నారు. సమావేశంలో నాయకులు గేదెల రమేష్, గులాం రసూల్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



చమల్లమూడిలో సీతారామస్వామి దేవాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

ప్రత్తిపాడు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమల్లమూడిలో బుధవారం సీతారామస్వామి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుచరితను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ఆధ్యాతిక్మక మార్గం ప్రతి ఒక్కరి ప్రశాంతతకు మార్గమన్నారు. వెంట జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి సన్నిధిలో..

గుంటూరురూరల్ మండల పరిధిలోని తురకపాలెంలో బుధవారం పోలేరమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం 10వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుచరిత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిపారు. అమ్మవారి హారతులందుకున్నారు. వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కేవీ సుబ్బరాజు



ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు

పెదనందిపాడు: ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు అన్నారు. బుధవారం పెదనందిపాడు పీహెచ్‌సీని సందర్శించి, వివిధ విభాగాలను పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయారోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష జరిపి, అన్ని కార్యక్రమాలు పూర్తిగా ప్రజలకు అందించడంలో విధిగా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి విజయ రత్నకుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాకుమానులో...

కాకుమాను: వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యశాలకు వచ్చేవారిని వైద్య సిబ్బంది ప్రేమ పూర్వకంగా పలకరించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరిని వైద్య సిబ్బంది తమ కుటుంబ సభ్యుల వలే ప్రేమ పూర్వకంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్పొరేట్ వైద్యశాలల కంటే ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్లి, వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా ప్రతి రోజు వైద్యశాలకు ఎంతమంది వస్తున్నారు, ఏయే వైద్యసదుపాయాలు కల్పిస్తున్నారు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక వైద్యులు డాక్టర్ రవి ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛంద సేవకులు వలంటీర్‌లు



వలంటీర్‌కు ప్రశాంసాపత్రాన్ని అందజేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్

అప్పాపురం(కాకుమాను): అనునిత్యం ప్రజల కోసం పనిచేసే నిత్య శ్రామికులు గ్రామ వలంటీర్‌లు అని జడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని అప్పాపురం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం వలంటీర్‌లకు వందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీటీసీ గుల్జార్ బేగం మాట్లాడుతూ కాలాలు, నెలలు, వారాలు మారినా తమకు కేటాయించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో సక్రమంగా ప్రజలకు అందజేస్తూ, వారి మన్ననలు పొందుతున్న నిత్య శ్రామికులు గ్రామ వలంటీర్‌లు అని కొనియాడారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీనే, తొలి కోడి కూయక ముందే అవ్వా,తాతల చేతుల్లో పింఛన్ నగదు అందించి వారి మోముల్లో చిరునవ్వులు నింపుతూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మధ్య వారధుల్లా పని చేస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. ఈసందర్భంగా ఉత్తమ వలంటీర్‌లుగా ఎన్నికైన వారిని పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పొందుగుల ఆచారి, ఎంపీటీసీ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సరిత, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.